క్లుప్తంగా

ప్రతి రైతు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలి

పిట్టలవానిపాలెం: రబీ పంటలు సాగు చేస్తున్న రైతులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని మండల వ్యవసాయ విస్తరణాధికారి సుదర్శనరావు తెలిపారు. మండలంలోని చందోలు రైతు భరోసా కేంద్రంలో ఆదివారం ఈకేవైసీ నిర్వహించారు. కార్యక్రమంలో వీఏఏ గుడారు ఉన్నారు.

హమారా ప్రసాద్‌ను కఠినంగా శిక్షించాలి

పిట్టలవానిపాలెం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన తెలంగాణ మతన్మోది హమారా ప్రసాద్‌ను కఠినంగా శిక్షించాలని కేవీపీఎస్, అంబేడ్కర్ యువజన సంఘాల ఆధ్వర్యంలో ఖాజీపాలెం సెంటర్‌లో ఆదివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు కె.శరత్ మాట్లాడుతూ సోషల్ మీడియా వేదికగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై చంపుతానంటూ అనుచితంగా మాట్లాడిన హమారా ప్రసాద్‌ను అరెస్టుచేయడంతో పాటు కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అనంతర హమారా ప్రసాద్ చిత్రపటాలను దహనం చేశారు. కార్యక్రమంలో పలికే విక్టర్‌పాల్, చేబ్రోలు మరియదాసు, ఎస్.హరీష్, ఎం.వంశీ, చందు, రాహుల్, నితీన్ పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ



అమృతలూరు(వేమూరు): ఎన్టీఆర్ సేవా సమితి తరపున పేదలకు దుప్పట్లు అందజేయడం జరుగుతుందని మాజీ ఎంపీపీ మైనేని రత్న ప్రసాద్ తెలిపారు. మండల కేంద్రంలో ఆదివారం 50 మంది వృద్ధులకు దుపట్లు పంపిణీ చేశారు. ఎన్టీఆర్ శత జయంతి సందర్భంగా గ్రామానికి చెందిన కొత్తపల్లి వెంకట సుబ్బయ్య, చారుమతి దంపతులకు జ్ఞాపకార్థం కుమార్తె అంబోజమ్మ కుటుంబ సభ్యుల సహకారంతో దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యకరమంలో సుమతి కృష్ణ, షేక్ రంజాని, వెనిగళ్ల ప్రదీప్, కొత్తపల్లి రత్తయ్య, కొల్లిపర నాగేమల్లేశ్వరరావు, ఏలూరు నరసింహారావు పాల్గొన్నారు.

పెసర తీత పనులు ప్రారంభం



అమృతలూరు(వేమూరు): రబీ సీజనలో మినుము, పెసర పంటలు తీత ప్రారంభించారు. ఆదివారం నుంచి రైతులు పెసర పంట తీత పనుల్లో కూలీలు బిజీగా ఉన్నారు.

ఉచిత వైద్య శిబిరం

కర్లపాలెం: సంతానం కలగని దంపతులు వైద్య పరీక్షలు చేయించుకుని మందులు వాడితే పిల్లలు పుడతారని చీరాల గోరంట్ల సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సంతాన సాఫల్య వైద్యులు మేడికొండ ప్రీతి తెలిపారు. కర్లపాలెంలోని రామకృష్ణ సేవా సమితిలో ఆదివారం గోరంట్ల సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సంతాన సాఫల్య వైద్యులు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో సుమారుగా 50 జంటలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు.

ఆర్థిక సాయం

చింతమోటు(భట్టిప్రోలు): గ్రామానికి చెందిన కొలకలూరి చంద్రమ్మ కుమారుడు బాబు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో ఆదివారం గ్రేస్ ఫౌండేషన్ అధినేత కైతేపల్లి షాలేమ్‌రాజు ఆ కుటుంబాన్ని పరామర్శించి రూ.5 వేలు ఆర్థిక సహాయం అందించారు. అనంతరం కొల్లూరు మండలం తాడిగిరిపాడుకు చెందిన పెయింట్ కార్మికుడు పిల్లి ఉదయ్ కిరణ్ ఇటీవల ప్రమాదవశాత్తూ భవనంపై నుంచి కింద పడటంతో రెండు కాళ్లు పని చేయక మంచంలో ఉన్నాడు. ఉదయ్ కిరణ్‌ను పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు యన్నం సురేష్, మాణిక్యారావు, దున్నా నారాయణ, అత్తోట ఇసాకు, చిలకా మోహన్, క్రాప నాని పాల్గొన్నారు.

అమరావతి కాలనీ సంక్షేమ సంఘ సమావేశం



తెనాలిటౌన్: అమరావతి కాలనీ గృహ యజమానుల సంక్షేమ సంఘ సర్వ సభ్య సమావేశం కాలనీలోని కమ్యూనిటీ సెంటర్ వద్ద ఆదివారం జరిగింది. సమావేశానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఖాలేదా నసీమ్ మాట్లాడుతూ అమరావతి కాలనీలో మౌలిక వసతులు, అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని హామీ ఇచ్చారు. 2023–25 సంవత్సర కాలానికి సంఘ కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గుమ్మడి నారాయణరావు, ఉపాధ్యక్షుడిగా కె.జయపాల్, ప్రధాన కార్యదర్శిగా జి.పూర్ణ చంద్రరావు, ఫైనాన్స్ సెక్రటరీ జగన్మోహనరావు, జాయింట్ సెక్రటరీ రామకృష్ణ, గౌరవ అధ్యక్షుడిగా సిద్ధయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

పేద ప్రజల సంక్షేమమే ధ్యేయం

- మంత్రి మేరుగ నాగార్జున
- ఇంటూరులో గడప గడపకు మన ప్రభుత్వం



ఇంటూరులో సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తున్న మంత్రి మేరుగ నాగార్జున

ఇంటూరు(వేమూరు): పేద ప్రజలు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున తెలిపారు. అమృతలూరు మండలంలోని ఇంటూరులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. గ్రామంలో ప్రతి గడప గడపకు వెళ్లి ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు అమలు తీరు గురించి అడిగి తెలుసుకుంటున్నారు. ప్రతిఇంటికి అందిన లబ్ధిని వివరించారు. సంక్షేమ పథకాలు అందక పోతే నా దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ సందర్భంగా ప్రజలు ఆయన దృష్టికి తీసుకొచ్చిన కొన్ని సమస్యలు అధికారులను పిలిచి అక్కడిక్కడ పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి నాగార్జున మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి విద్యా రంగంలో పలు సంస్కరణలు తీసుకొచ్చినట్లు చెప్పారు. చంద్రబాబు నాయుడు రాజకీయంగా పూర్తిగా విఫలమైనట్లు పేర్కొన్నారు. రాజకీయంగా అడ్డు వస్తున్న వ్యక్తులను హత్యలు చేయించడం ఆయన చేసిన మేలు అని ప్రజలకు చెప్పారు. నారా లోకేష్ నాపై చర్చలకు సవాల్ చేశారు. రాష్ట్ర అభివృద్ధి గురించి, ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు అమలు తీరుపై, సాంఘిక సంక్షేమ శాఖ అభివృద్ధిపై చర్చకు సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. లోకేశ్, నారా చంద్రబాబునాయుడు, ఆనంద్‌బాబు రావాలని సవాల్ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ రాపర్ల నరేంద్ర, గ్రామ సర్పంచి మొద్దు జీవమణి, రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి వీరభద్ర శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర లీగల్ సెల్ సెక్రటరీ గుమ్మడి రవిరాజ్, రాష్ట్ర సాహిత్య అకాడమీ డైరెక్టరు ఓలేటి శివాజీ, ఎంపీటీసీలు తమ్మ వెంకట రెడ్డి, కె.ఆనంద్ కుమారి, మాజీ సర్పంచులు బట్టు మోషే, కుంభం శామ్యూల్, సొసైటీ అధ్యక్షులు కాజా శంకర్ రెడ్డి, యలవర్తి సురేష్, పి.మేరి మంజులా, దంతు కృష్ణారెడ్డి, భీమవరపు సాంబరెడ్డి, దుండి రాఘవ రెడ్డి, అవుతు ముత్తా రెడ్డి, ఆర్ మోహన్ రెడ్డి, అమ్మిరి రత్నాకర్ రెడ్డి, నియోజకవర్గ బీసీ సెల్ కన్వీనర్ వీరాంజినేయులు పాల్గొన్నారు.

బండ్లమ్మ అమ్మవారికి పూజలు



ప్రత్యేక అలంకారంలో బండ్లమ్మవారు

చందోలు(పిట్టలవానిపాలెం): గ్రామంలోని బగళాముఖి బండ్లమ్మ అమ్మవారి దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పసుపు, కుంకుమలతో అర్చనలు, అభిషేకాలు జరిపించారు. పరిసర గ్రామాలనుండి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దేవాలయ ప్రాంగణంలో పొంగళ్లు పొంగించి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి కొబ్బరి కాయలు కొట్టి మొక్కుబడులు తీర్చుకున్నారు. ఈనెల 14వ తేదీన ప్రత్యేక హోమం నిర్వహించనున్నట్లు ఈఓ నరసింహమూర్తి తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్‌రెడ్డి, కార్యనిర్వహణాధికారి జి.నరసింహమూర్తి, ఆలయ వంశపారంపర్య అర్చకులు కుంచల నరసారెడ్డి ఉన్నారు.



బీరువాలను దేవదాయ శాఖ అధికారులకు అందజేస్తున్న దృశ్యం

రెండు బీరువాలు బహూకరణ

బండ్లమ్మ దేవాలయాని పిట్టువారిపాలేనికి చెందిన పిట్టు తాతిరెడ్డి, శైలజ దంపతులు రూ.60 వేల విలువల చేసే రెండు బీరువాలను అందజేశారు. అనంతరం దాత తరపున వెంకటేశ్వరరెడ్డికి అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించి ఈఓ జి.నరసింహమూర్తి సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

సాయిబాబా మందిరంలో శివ లింగ ప్రతిష్ట



పూజలు చేస్తున్న భక్తులు

పెరవలి(వేమూరు) మండలంలోని పెరవలి గ్రామంలోని సాయిబాబా మందిరం ప్రాంగణంలో ఆదివారం అన్న పూర్ణ సమేత కాశీ విశ్వేర్వ స్వామి శివ లింగ ప్రతిష్ట కార్యక్రమం అత్యంత వైభంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహాశాంతి హోమం పూర్ణాహుతి, అన్నదానం కార్యక్రమాలు నిర్వహించారు. కొత్త మాసు సాంబశివరావు విజయలక్ష్మి దంపతులు అన్న పూర్ణ సమేత కాశీ విశ్వేర్వ స్వామి మూల విరాట్‌ను సమర్పించారు. కార్యక్రమంలో మందిర వ్యవస్థాపక ధర్మకర్త కరెడ్ల శ్రీనివాసరరావు, గ్రామ సర్పంచి దాది వెంకట లక్ష్మీరాజ్యం, సుబ్బారావు దంపతులు పాల్గొన్నారు.

ప్రకృతి వైద్యంపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న ప్రకాశం జిల్లా రవాణా శాఖ ఉప కమిషనర్ డాక్టర్ బి.శ్రీకృష్ణవేణి

వల్లభాపురం(కొల్లిపర): నేటి సమాజంలో ప్రజలు ప్రకృతి వైద్యం, యోగ, సాంప్రదాయాలపై అవగాహన పెంచుకోవాలని ప్రకాశం జిల్లా రవాణా శాఖ ఉప కమిషనర్ డాక్టర్ బి.శ్రీకృష్ణవేణి అన్నారు. ఆదివారం మండలంలోని వల్లభాపురం గ్రామంలో వినాయస్వామి ఆలయ 111వ వార్షికోత్సవంలో ముఖ్యఅతిథులుగా పాల్గొని ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేడు దేవాలయ వ్యవస్థ ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు అనేక సామాజిక కార్యక్రమాలలో పాలుపంచుకోవటం విశేషమన్నారు. గ్రామీణ యువత సివిల్స్, గ్రూపులకు హాజరు అవ్వాలనుకుంటే తన లాంటి ఎందరో తమ ఖాళీ సమయాలలో ఉచితంగా గైడెన్స్ ఇవ్వగలమని సూచించారు. గణాంకాల శాఖ రిటైర్ట్ అసిస్టెంట్ డైరెక్టర్ జి.ప్రసాదరావు మాట్లాడారు. తొలుత ఆలయంలో విశ్వశాంతి యజ్ఞం (శాంతి హోమం), సుందరకాండ పారాయణం నిర్వహంచారు. కార్యక్రమాలు అనంతరం ముఖ్య అతిథులను గ్రామ పెద్ద బొమ్మారెడ్డి సాంబిరెడ్డి చేతులు మేదుగా వారిని శాలువాలతో, పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ వ్యవస్థాపక సభ్యురాలు లలిత కుమారి, ఆలయ ధర్మకర్త అచ్యుత ఇందుశేఖర్, వేద ప్రచారకులు శ్రీగొడవర్తి కోటేశ్వరరావు, పారాయణ కర్త చిర్రా విష్ణువర్ధనరెడ్డి, అచ్యుత ప్రభాకరబాబు, ఉల్లంగటి శ్రీనివాస్, దేవాలయ అర్చకుడు నందివెలుగు సత్యసాయి, భక్తులు పాల్గొన్నారు.

ముగిసిన జ్ఞానమందిరం వార్షిక మహోత్సవాలు

వైభవంగా లక్ష్మీ గణపతి హోమం



మందిరంలో పూజలు చేస్తున్న కమిటీ సభ్యులు, భక్తులు

తెనాలిటౌన్: రూరల్ మండలం కొలకలూరులోని రామసాయి జ్ఞాన మందిరంలో జరుగుతున్న వార్షిక మహోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా ఉదయం 5.15 గంటలకు కాగడ హారతి, అనంతరం బాబా వారికి పంచామృత అభిషేకాలు నిర్వహించారు. ఉదయం ఎనిమిది గంటలకు లక్ష్మీగణపతి హోమాన్ని రామసాయిట్రస్ట్ ప్రెసిడెంట్ సంకా సతీష్ దంపతులు, మహిళలు నిర్వహించారు. భక్తులు తెచ్చుకున్న పంచామృతములు, గంధం, నవీజవాలను హోమంలో వేశారు. బాబావారి శేష వస్త్రాలను వేలం నిర్వహించగా పలువురు భక్తులు వస్త్రాలను కొనుగోలు చేశారు. బాబావారిని ప్రత్యేకంగా అర్చకుడు శ్రీనివాసరావు అలంకరించి పూజలు జరిపారు. అనంతరం భక్తులకు అన్నసంతర్పణ చేశారు. కార్యక్రమాన్ని ట్రస్ట్ ప్రెసిడెంట్ సతీష్, వైస్ ప్రెసిడెంట్ మలిశెట్టి శ్రీనివాస్, సంకా సీతారామయ్య, రవికుమార్, కొల్లిపర సీతారామకోటేవ్వరరావు, పోకల శివరామకృష్ణ, అకరంశెట్టి నాగేశ్వరరావు, అమరేంద్రప్రసాద్‌లు పర్యవేక్షించారు.

వెదురు కర్రలు పంపిణీ



వెదురు కర్రలు పంపిణీ చేస్తున్న దృశ్యం

తెనాలిటౌన్: పట్టణంలో మేదర కులస్తులకు మేద హ్యాండ్ క్రాఫ్ట్ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో రూ.25వేలు విలువగల వెదురు కర్రలను ఆదివారం అందజేశారు. మార్కెట్ సెంటర్ సమీపంలో జరిగిన కార్యక్రమంలో సొసైటీ మార్కెటింగ్ డైరెక్టర్ కొండా భానుశ్రీనివాస్ వెదురు వృత్తి మీద జీవిస్తున్న కొన్ని కుటుంబాల వారికి ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో పట్టణ మేదరి సంఘ ప్రెసిడెంట్ తమ్మినేని రాఘవేంద్ర, సెక్రటరీ గజపనేని రెడ్డమ్మ, మేదర వర్గీయులు పాల్గొన్నారు.

కోనను మర్యాదపూర్వకంగా కలిసిన దాసరి కిరణ్

బాపట్ల: బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతిని తిరుపతి దేవస్థానం బోర్డు సభ్యుడు దాసరి కిరణ్‌కుమార్ ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. బాపట్లలోని ఓ ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన దాసరి, రఘుపతితో మాట్లాడారు.

రైతు ఆత్మహత్య



పెదలంక(భట్టిప్రోలు): అప్పుల బాధతో ఓ రైతు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. భట్టిప్రోలు పోలీసుల కథనం.. మండలంలోని పెదలంక గ్రామానికి చెందిన మల్లిపెద్ది సురేంద్రబాబు(50) పది ఎకరాలు మెట్ట భూమి సాగుచేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఈ నేపథ్యంలో పంటకు పెట్టుబడులు పెట్టేందుకు పలు బ్యాంకుల్లో రుణాలు తీసుకుని కట్టలేకపోవడంతో వడ్డీలు పేరుకుపోయాయి. 2011 నుంచి పసుపు పంట దిగుబడులు నిల్వ చేస్తూ రేటు వస్తుందనే ఆశతో ఉన్నాడు. ఏ ఏటికి ఆ ఏడు సరైన రేటు లేక పోవడం, మరొక పక్క బ్యాంకర్ల ఒత్తిడితో మనోవేదనకు గురై ఆదివారం తెల్లవారుజామున ఇంటి పక్కనే ఉన్న పశువుల చావిడిలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఉదయాన్నే సురేంద్ర బాబు కనపడకపోవడంతో కుటుంబ సభ్యులు వెతుకుతుండగా చావిడలో ఉరి వేసుకుని ఉందాన్ని గమనించారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వై.సురేష్ తెలిపారు.

ముగిసిన హిందీ ప్రచార సభ పరీక్షలు



భట్టిప్రోలు హైస్కూల్‌లో హిందీ ప్రచార సభ పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

భట్టిప్రోలు: భట్టిప్రోలు టీఎంరావు హైస్కూల్‌లో శనివారం నుంచి నిర్వహిస్తున్న దక్షిణ భారత హిందీ ప్రచార సభ పరీక్షలు ఆదివారం ముగిశాయి. ఈ పరీక్షలకు భట్టిప్రోలుతో పాటు చెరుకుపల్లి, కొల్లూరు, వేమూరు మండలాల నుంచి విద్యార్థులు హాజరయ్యారు. విశారద ఉత్తరార్థ, ప్రవీణ ఉత్తరార్థ పరీక్షలకు 325 మంది విద్యార్థులకు గాను 313 మంది హాజరు కాగా 12 మంది గైర్హజరయ్యారు. చీఫ్ సూపరింటెండెంట్‌గా హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు సి.రామకోటేశ్వరరావు వ్యవహరించారు.

రేపల్లెలో..

రేపల్లె రూరల్: పట్టణంలోని రైలుపేట శ్రీ రామ కృష్ణ విద్యానిలయంలో ఈ నెల 11వ తేదీ నుంచి నిర్వహిస్తున్న దక్షిణ భారతీయ హిందీ ప్రచార సభ పరీక్షలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా విద్యానిలయం కార్యదర్శి అన్నవరపు శ్రీనివాసరావు మాట్లాడుతూ పరీక్షలకు 180 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. వివరాలకు 98660 47107, 98494 96374 సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో హిందీ ప్రచారకులు చింతలపూడి సతీష్ పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి దాతల సహకారం మరువలేనిది

తెనాలిటౌన్: షరాఫ్ బజార్‌లోని పంచముఖ ఆంజనేయస్వామి దేవస్థానంలో ఆదివారం అన్నసమారాధన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుతగా ఆలయ అభివృద్ధికి, మరమ్మతులకు సహకరించిన దాతలను ఆలయ వ్యవస్థాపక కుటుంబ సభ్యులు ఎస్‌బీ శివ, ఆలయ కార్యనిర్వహణాధికారి అవుతు శ్రీనివాసారెడ్డి, వంశపరంపర్య అర్చకుడు రొంపిచర్ల శ్రీనివాసమూర్తిలు అభినందించి జ్ఞాపికను బహూకరించారు. ఈ సందర్భంగా ఎస్‌బీ శివ మాట్లాడుతూ ఎంతో విశిష్టమైన పంచముఖ ఆంజనేయస్వామి ఆలయ అభివృద్ధికి దాతలు ముందుకు వచ్చి సహకరించడం సంతోషకరమన్నారు. ఆలయంలో విశేషంగా పూజలు నిర్వహించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ గుంటూరు కోటేశ్వరరావు, కౌన్సిలర్ పసుపులేటి త్రిమూర్తి, సంకీర్తన బృందం అధ్యక్షురాలు మూర్తి అనురాధ, సేవా సమితి అధ్యక్షులు ఆర్‌వీ కిరణ్‌కుమార్, సభ్యులు మూర్తి వెంకటేశ్వరరావు, గుడివాడ బాలకృష్ణ, బచ్చు లీలాప్రసాద్, ఆర్.సురేష్, మాజేటి వెంకటేష్, పల్లపోతు మురళి, కె.రాజశేఖర్, కొల్లూరు విద్యాసాగర్, తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాలకతీతంగా పథకాలు అమలు

- ఎమ్మెల్యే కోన రఘుపతి
- పేరలిలో గడప గడపకు మన ప్రభుత్వం



పేరలిలో మహిళకు ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

పేరలి(కర్లపాలెం): రాజకీయాలకు, కులమతాలకు అతీతంగా అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతోందని ఎమ్మెల్యే కోన రఘుపతి తెలిపారు. పేరలిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. తొలుత గ్రామంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే కోన రఘుపతి అధికారులతో కలసి గడప గడపకు వెళ్లి ప్రభుత్వం గత మూడేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళల అభ్యున్నతి కోసం వైఎస్సార్ ఆసరా, చేయూత, సున్నా వడ్డీ పథకాలను అందిస్తున్నారని చెప్పారు. బీసీ మహిళలకు చేయూత పథకం ద్వారా తమ ప్రభుత్వం లబ్ధి కల్పిస్తుందని పేర్కొన్నారు. సంక్షేమ పథకాల లబ్ధి పొందుతున్న వారందరూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదిస్తున్నారని, 2024 ఎన్నికలలో వైఎస్సార్ సీపీ అత్యధిక సఖథనాలు కైవసం చేసుకుని అధికారంలోకి రావటం ఖాయమని చెప్పారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి మల్లెల వెంకటేశ్వర్లు, వైఎస్సార్ సీపీ కర్లపాలెం మండల అధ్యక్షుడు దొంతిబోయిన సీతారామిరెడ్డి, బాపట్ల రూరల్ మండల అధ్యక్షుడు కోకి రాఘవరెడ్డి, ఎంపీపీ యారం వనజ, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు గొర్రుముచ్చు మీరయ్య, మండల పరిషత్ ఉపాధ్యక్షులు పందరబోయిన సుబ్బారావు, కాగిత బుల్లియ్య, కో ఆప్షన్ సభ్యుడు అమీర్‌బేగ్, సొసైటీ చైర్మన్ మరకా పెద వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ ఎలీషాబాబు పాల్గొన్నారు.

డాక్టర్ కృష్ణమూర్తి ఆదర్శనీయులు



డాక్టర్ కృష్ణమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

బాపట్ల అర్బన్: బాపట్ల ప్రముఖ విద్యా కేంద్రంగా భాసిల్లడానికి పటిష్టమైన పునాదులు వేసిన డాక్టర్ వై.ఎస్.కృష్ణమూర్తి చిరస్మరణీయులని ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి డాక్టర్ పి.సి.సాయిబాబు అన్నారు. డాక్టర్ కృష్ణమూర్తి ఐదో వర్ధంతిని ఆదివారం టౌన్‌హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1962లో బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీని స్థాపించి, వ్యవస్థాపక అధ్యక్షుడిగా రెండు దశాబ్దాల పాటు దానిని ప్రగతి పథంలో నడిపించారని గుర్తు చేశారు.. బాపట్ల వాసులకు ఉన్నత విద్యని అందించడం కోసం ఆయన కృషి మరువలేనిదన్నారు. కుల మతాలకు అతీతంగా సర్వ మానవాళి శ్రేయస్సు కోసం ఆయన పాటుపడ్డారు. ఆయన చూపిన బాటలో నడవడమే ఆయనకు మనం ఇచ్చే ఘనమైన నివాళి అన్నారు. చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఫోరం సభ్యులు, న్యూస్ పేపర్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా మాంట్‌ఫోర్ట్ స్కూల్ వార్షికోత్సవం



సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

రేపల్లె: పట్టణంలోని మాంట్‌ఫోర్ట్ పాఠశాల వార్షికోత్సవం శనివారం రాత్రి నిర్వహించారు. కార్యక్రమాన్ని రేపల్లె డీఎస్పీ మురళీకృష్ణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు ఆటల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎస్ఐ భరత్, పాఠశాల ప్రిన్సిపాల్ బ్రదర్ కిరణ్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ బ్రదర్ జాన్ పాల్ పాల్గొన్నారు.

గ్రామీణ వైద్యులు నైపుణ్యాలు పెంచుకోవాలి



మాట్లాడుతున్న డాక్టర్ బషీరుద్దీన్ వేదికపై డాక్టర్ షమ సుల్తానా, డాక్టర్ నజీరుద్దీన్ తదితరులు

గుంటూరు మెడికల్: మాన్విత కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఫస్ట్ ఎయిడ్ సేవలను అందించే గ్రామీణ వైద్యులు తమ నైపుణ్యాలను పెంచుకోవాలని సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ షమ సుల్తానా అన్నారు. హోప్‌విన్ హాస్పటల్స్, యువ నారీస్ హెల్త్ కేర్ ఆర్గనైజేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక బ్రాడీపేటలో గ్రామీణ వైద్యులకు ఆధునిక వైద్యసేవలపై మాన్విత పేరుతో అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ షమ సుల్తానా మాట్లాడుతూ ప్రతినెలా గ్రామీణవైద్యులకు స్కిల్స్ పెంపొందించేందుకు మాన్విత సర్టిఫికెట్ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. సీనియర్ ల్యాప్రోస్కోపిక్ సర్జన్ డాక్టర్ నజీరుద్దీన్, క్రిటికల్ కేర్ స్పెషలిస్ట్ డాక్టర్ బషీరుద్దీన్ మాట్లాడుతూ అత్యవసర వైద్యసేవలను ఆధునిక పద్ధతుల్లో గ్రామీణ వైద్యులు ప్రాథమిక చికిత్సను ఏ విధంగా చేయాలో మెలకువలు నేర్చుకోవాలన్నారు. జనరల్ ఫిజీషియన్ డాక్టర్ సాంబశివరావు, ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ రాహుల్‌రెడ్డి, హాస్పటల్ మేనేజర్ పి.నాగేశ్వరరావు, ఆర్ఎంపీ, పీఎంపీ అసోసియేషన్ నేతలు, సభ్యులు పాల్గొన్నారు.

కల్యాణం.. దివ్యమంగళం

దివ్యాంగ జంటకు వివాహం



దివ్యాంగ జంటకు మంగళసూత్రం అందజేస్తున్న డాక్టర్ రమణ యశస్వీ

నెహ్రూనగర్: దివ్యాంగుల వివాహ ఇన్ఫో సొసైటీ ఆధ్వర్యంలో గుంటూరులోని అంబేడ్కర్ భవన్‌లో దివ్యాంగ జంటకు వివాహం జరిపించారు. నెల్లూరు జిల్లాకు చెందిన కాళహస్తి తిరుమలేష్, కరీంనగర్‌కు చెందిన భస్వరాజు స్వప్నలు ఆదివారం వివాహంతో ఒక్కటయ్యారు. కుటుంబ సభ్యుల మధ్య ఎంతో ఉత్సాహంగా వివాహ వేడుక జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ రమణ యశస్వీ దంపతులకు మంగళసూత్రాన్ని అందజేశారు. దివ్యాంగుల వివాహాలకు సొసైటీ ప్రెసిడెంట్ 8555810100 నంబర్‌లో సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సభ్యులు సురేష్, మాధురి, లక్ష్మీ, పద్మ, లక్ష్మణ్, మేరీ, హని, పద్మశ్రీ, సృజన్, భాస్కర్, రాము, సునీల్, మురళీ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి

గుంటూరు మెడికల్: నటరాజ్ హాస్పటల్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ముత్యాలరెడ్డినగర్ 7వలైనులో ఉచిత వైద్య శిబిరం జరిగింది. ఈ సందర్భంగా హాస్పటల్ అధినేత, న్యూరాలజిస్టు డాక్టర్ పి.నటరాజ్ మాట్లాడుతూ ఆధునిక జీవనశైలి వల్ల నేడు నరాల జబ్బులు, వెన్నుముక సమస్యలు ఎక్కువగా వస్తున్నాయన్నారు. మెదడు సంబంధిత వ్యాధులపై అవగాహన లేకపోవటంతో చాలా మంది సమస్య తీవ్రమయ్యే వరకు వైద్యులను సంప్రదించటం లేదన్నారు. ప్రాథమిక దశలోనే గుర్తిస్తే త్వరితగతిన నయం చేయవచ్చన్నారు. ఇలాంటి ఉచిత వైద్యశిబిరాలను ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. ఉచిత వైద్యశిబిరంలో 500 మందికి వైద్యపరీక్షలు చేసి మందులు కూడా ఉచితంగా అందించామని డాక్టర్ నటరాజ్ తెలిపారు.